క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రీకృష్ణుని ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

గన్నవరం: స్థానిక యాదవుల రామాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం వాస్తుపూజ, వాస్తు హోమం, మండప పూజ నిర్వహించారు. సాయంత్రం నూతనంగా ప్రతిష్ఠించనున్న శ్రీకృష్ణస్వామి వారి విగ్రహానికి గ్రామోత్సవం జరిపారు. సాయంత్రం ప్రధాన కుంభ స్థాపన, మూలమంత్ర హోమాలు, పుష్పాధివాసం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 8 గంటలకు జరగనున్న నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులు హాజరుకావాల్సిందిగా ఆలయ కమిటీ, యాదవ సంఘం నేతలు కోరారు. అనంతరం శాంతి కల్యాణం, అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు.

సమాజ ఉన్నతిలో భాగస్వామ్యం కావాలి



కంకిపాడు: సమాజ ఉన్నతిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నవజీవన్ బాలభవన్ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ ఎండీ వసంత అన్నారు. మండలంలోని ఉప్పులూరు గ్రామంలో ఆశ కార్యకర్తలతో కేర్ అండ్ కమ్యూనిటీ ప్రోగ్రామ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ సమాజంలో అందరితో కలిసి పనిచేయాలన్నారు. పిల్లలు చదువు మానేసి ఇళ్ల వద్ద ఉండి వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ శారమ్మ, కంకిపాడు టీచర్లు పి.మేరీ, ఎం.పెద్దింట్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి పీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు ఇమ్మడి శేఖర్ బాబు, భవానీ మీనాక్షి దంపతుల సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు కమ్మవారి ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో రూ.30 వేలు విరాళాన్ని మంగళవారం అందజేశారు. బాపులపాడు గ్రామానికి చెందిన చింగలూరి హేమలత ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావటంతో కాళ్లు, చేతులు పూర్తిగా చచ్చుబడిపోయాయి. దీంతో ఆమె కమ్మవారి ఐక్య సేవా సమితిని ఆశ్రయించింది. వెంటనే స్పందించిన సమితి అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.30,336 నగదును చెక్కు రూపంలో ఆమెకు అందజేశారు. సమితి సలహాదారుడు అట్లూరి రాజశేఖర్, సహాయ కార్యదర్శి పొట్లూరి సత్యఫణీంద్ర, వీరమాచినేని రవికుమార్ పాల్గొన్నారు.

మానవత విద్యానిధికి రూ.20 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థుల చదువుకు అండగా ఉండేందుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన విద్యానిధికి హనుమాన్‌జంక్షన్ శాఖ తరపున రూ.20 లక్షలు విరాళం అందజేసినట్లు ఆ సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ మొత్తాన్ని గుడివాడలో జరిగిన ఓ కార్యక్రమంలో మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డికి అందజేశామన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ తరపున రూ.50 లక్షలతో విద్యానిధి ఏర్పాటు చేయాలని సంకల్పించామని చెప్పారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి



గన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు



తాడిగడపలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కంకిపాడు: విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని ప్రజా ఐక్యవేదిక జిల్లా నాయకులు పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నేత రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు స్మార్ట్‌మీటర్లను పగలకొట్టాలని చెప్పి, అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేయటంలో దూకుడు ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పోతురాజు నాగేశ్వరరావు, బి.సాంబశివారెడ్డి, చింతయ్య, వి.శివశంకర్, సీహెచ్ శ్రీహరి, వి.జాన్‌మోజేస్, వి.మరియదాసు, వి.రమేష్, జి.బాబి తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి

ఉయ్యూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నాయని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉయ్యూరు ప్రధాన సెంటరులో ఆందోళన చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకూ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. నాయకులు వి.రాజేష్, అన్నే సుబ్బారావు, కీర్తి, నాగమణి, శ్రీలక్ష్మి, తిరుపతయ్య, రవి, లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ రీజనల్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

తాడిగడప మున్సిపాలిటీ వద్ద ధర్నా

పెనమలూరు: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై కోట్ల రూపాయలు భారం మోపారని, పైగా స్మార్ట్ మీటర్ల పేరుతో అదనపు భారం ప్రజలపై వేయటానికి కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు ఆరోపించారు. తాడిగడప మున్సిపాలిటీ వద్ద విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం, సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్, నాయకులు ప్రసన్న, శ్రీనివాసరావు, పాతాళలక్ష్మి, లక్ష్మీనారాయణ, వీసంసోమశేఖర్, నారిన వెంకట్రావు, జోజిమేరీ పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు షేక్.మస్తాన్‌వలి మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలు అడ్డుకోవాలన్నారు. నాయకులు షేక్.బాబు, మాధవ, హుస్సేన్‌బి, పాపారావు, పాలాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

చార్జీలు రద్దు చేయాలని డిమాండ్

గన్నవరం: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కాట్రగడ్డ రామచంద్రజోషి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజాసంఘాల ఐక్య వేదిక నేతలు ప్రదర్శనగా తరలివెళ్లి గ్రామ సచివాలయం-1లో పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావుకు వినతిపత్రం సమర్పించారు. నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, కట్టవరపు విజయరావు, కళ్లం వెంకటేశ్వరరావు, నూతక్కి రామ్మోహన్‌రావు, సూరగాని సాంబశివరావు, వెంగళ శివయ్య, బెనర్జీ, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, ఆవుటపల్లి సాంబయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లిలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ జరిగింది. అనంతరం పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి, పులపాక రమేష్, శ్రీను పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ఆర్థిక భారాలు మోపడమే

నున్న(విజయవాడరూరల్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులపై ఆర్థిక భారం మోపడమేనని సీపీఐ(ఎం) ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు యత్నాలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నాలు చేపట్టాలని ప్రజా సంఘాల పిలుపులో భాగంగా నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం వినతి పత్రంతో పాటు సంతకాలు సేకరించిన పత్రాలను విద్యుత్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. నాయకులు ఎం.ఆంజనేయులు, జీవీ రంగారెడ్డి, గుంటక చినవెంకటరెడ్డి, సట్టు శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, డిల్లీ వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.సురేష్, అజయ్, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో సీఐటీయూ ఆందోళన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల భారం మోపవద్దని సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక నూజివీడురోడ్డులోని విద్యుత్ కార్యాలయాల సముదాయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు ఏఈ కల్యాణికి వినతిపత్రం అందజేశారు. నాయకులు తోట సాంబశివరావు, తాళం మధు, శ్రీనివాసరావు, సన్యాసిరావు, వీరబాబు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి



కంకిపాడు: పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ స్వర్ణలత సూచించారు. మండలంలోని మద్దూరు, గొడవర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో కలిసి వ్యవసాయశాఖ అధికారుల బృందం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. సాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి..

ఏడీ స్వర్ణలత మాట్లాడుతూ పసుపు పంటకు బీమా చెల్లింపునకు ఈనెల 14వ తేదీ వరకూ గడువు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక దిగుబడులు సాధనకు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రతి సర్వే నంబరు పంట నమోదు కార్యక్రమం చేయించుకోవాలన్నారు. ధాన్యం విక్రయాల సమయంలో అవరోధాలు తలెత్తకుండా ఉంటుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వి.ఉషారాణి, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి వృద్ధి



గోసాలలో మాట్లాడుతున్న సులోచనరాణి



పాతపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంకిపాడు: తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి సూచించారు. మండలంలోని మద్దూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ అన్నామణి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రిక, మహిళా సంరక్షణ కార్యదర్శి సరళ, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

పాతపాడు(విజయవాడరూరల్): తల్లిపాలు బిడ్డకు ఆరు నెలల పాటు తప్పనిసరిగా ఇవ్వాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.భానుమతి అన్నారు. పాతపాడు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 2 కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. టాటా ట్రస్ట్ ప్రతినిధి కిన్నెర గర్భిణులకు, బాలింతలకు, బాలమృతం పిల్లలకు బహుమతులను అందజేశారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీ వైద్య విభాగం విద్యార్థులు, అంగన్‌వాడీ కో ఆర్డినేటర్ శైలజ, సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, ఎంఎస్‌కే, అంగన్‌వాడీ కార్యకర్తలు, నున్న సెక్టార్ 19 సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: తల్లి పాలు ఇవ్వటం వలన తల్లికి-బిడ్డకు చాలా మేలు జరుగుతుందని గోసాల సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎల్.సులోచనరాణి అన్నారు. గోసాల గ్రామంలో 4,7 అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్.రహిమున్నీసా, ఎల్.పద్మావతి, పి.గౌరిమాధవి, ఎ.దుర్గాభవాని, ఎం.నాగమణి, షేక్.ఖాదరున్నీసా పాల్గొన్నారు. యనమలకుదురు విశ్వశాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు చేశారు. తల్లిపాల ప్రాముఖ్యతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్యాణి వర్మ తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డి.కృష్ణవేణి, అరుణ, శాంతకుమారి, శైలజ, తల్లులు పాల్గొన్నారు.

గన్నవరం: ఉంగుటూరు మండలం తరిగొప్పల గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతపై అంగన్‌వాడీలచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డలో రోగ నిరోధకశక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి గంగాధరరావు, ఏఎన్‌ఎం కన్నమ్మ, ఎంఎస్‌కే మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, లతాకిరణ్ పాల్గొన్నారు.

చంద్రబాబూ...యూరియా ఎక్కడ ?

- వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజక వర్గ సమన్వయకర్త దేవభక్తుని



ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న దేవభక్తుని చక్రవర్తి, రైతులు

ఉయ్యూరు: కూటమి ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. చంద్రబాబూ యూరియా ఎక్కడ అంటూ ప్రశ్నించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎరువుల కొరతపై ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాంప్లెక్సు, యూరియా దొరక్క రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాదాపు 50 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. 35 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందన్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు దొరక్క రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలోని 24 పీఏసీఎస్ కేంద్రాల్లో ఒక్క యూరియా కట్ట కూడా అందుబాటులో లేదని ధ్వజమెత్తారు.

బ్లాక్‌మార్కెట్‌లో ప్రతి కట్టకు రూ.100 అదనంగా చెల్లించి ఎరువులు కొనుక్కోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో నడుస్తోంది కూటమి ప్రభుత్వం కాదని కోతల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసి పెట్టుబడి సాయాన్ని అర్హులందరికీ ఎగనామం పెట్టిన ఘనుడు చంద్రబాబు అని చక్రవర్తి ధ్వజమెత్తారు. పంటల బీమా చెల్లించలేని దీనస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వం, వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగాలు ఏమీ పట్టనట్లు చోద్యం చూడటం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారని గుర్తుచేశారు. రైతులకు అండగా నిలిచారని వివరించారు. కంకిపాడు జెడ్పీటీసీ బాకీ బాబు, పార్టీ మున్సిపల్‌విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జంపాన కొండలరావు, పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, ఉయ్యూరు, కంకిపాడు మండల అధ్యక్షులు దాసే రవి, మాదు శ్రీహరిరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసరావు, రైతు నాయకులు గొల్లపూడి వేణుబాబు, నక్కా శ్రీనివాసరావు, చిన ఓగిరాల సాంబయ్య, పి.రాఘవరావు(చిన్నారి), పిడికిటి రామకోటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సదస్సులో మాట్లాడుతున్న అబ్దుల్ ఖదీర్

రామవరప్పాడు: పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించుకోవాలని ముఖ్య అతిథి డాక్టర్ అబ్దుల్ ఖదీర్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ మహిళా కళాశాలలో మంగళవారం 'వ్యాపార అభివృద్ధి- అంకుర సంస్థ స్థాపన' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖదీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారడం వల్ల ఉపాధి అవకాశాలను కల్పించినవారవుతారన్నారు. అంకుర సంస్థ స్థాపన, వ్యాపార అభివృద్ధి అనేక ఒడిదుడుకులతో కూడిన అంశమని చెప్పారు. విద్యార్థి దశలోనే వ్యాపార నైపుణ్యాలను సాధించినట్లయితే ఈ రంగంలో విజయం సాధించగలరన్నారు. కంపెనీల స్థాపనకై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందించే రుణాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కావాల్సిన నైపుణ్యాలు, వనరులు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిగడప మున్సిపాలిటీకి కొత్త జేసీబీ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు చేయటానికి రూ.35 లక్షలతో కొత్తగా కొనుగోలు చేసిన జేసీబీని మంగళవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరధిలో డ్రెయినేజీలు, చెత్త తొలగించటానికి జేసీబీని కొనుగోలు చేశామన్నారు. ఇటీవల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో 30 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు వాహనాలను గుంటూరు జిందాల్ ప్లాంట్‌కు చెత్త తరలించాటానికి కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ షేక్.నజీర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతుబజార్ వద్ద ప్రమాద ఘంటికలు

- తరచుగా జరుగుతున్న ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు



హైవేపై రైతుబజార్ వద్ద నిలిచిన ట్రాఫిక్‌జామ్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ

పెనమలూరు: కానూరు కేసీపీ కాలనీ ఎదురుగా జాతీయ రహదారి పక్కనే ఉన్న రైతు బజార్ ప్రమాదాలకు నిలయంగా మారింది. తరుచూగా ప్రమాదాలు జరుగతున్నాయి. ఓ మహిళ మంగళవారం కూరగాయలు కొని ఇంటికి బయలు దేరింది. ఆమె జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ వైపునకు వెళ్లే బైక్ అతి వేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో మహిళ గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. చేతిలో కూరగాయలు చెల్లాచెదురయ్యాయి. ఇటువంటి ఘటనలు తరచుగా రైతుబజార్ వద్ద జరుగుతున్నా పోలీసుల్లో మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. రోడ్డు ప్రమాదాలకు అడ్డాగా రైతుబజార్ మారింది. వివరాల్లోకి వెళితే విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరించిన సమయంలో కానూరు కేసీపీ కాలనీ ఎదురుగా పేదల ఇళ్లను ప్రభుత్వం ఖాళీ చేయించింది. అయితే రోడ్డు విస్తరణ కొంత మేరకే చేసి మిగతా రోడ్డులో సర్వీస్ రోడ్లు వేయాల్సిండగా నేటికి వేయలేదు. ఖాళీ స్థలంలో గత ప్రభుత్వం గ్రీనరీ పెంచింది. స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంది.

ఎన్‌హెచ్‌ఐ స్థలంలో రైతుబజార్

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుబజార్ ముసుగులో దందా ప్రారంభించారు. ఎన్‌హెచ్‌ఐ సేకరించిన స్థలంలో ప్రైవేటు రైతుబజార్ పెట్టారు. ఇది జాతీయ రహదారికి ఆనుకునే ఉంది. ఫుట్‌పాత్‌లు పగుల కొట్టి, గ్రీనరీ తొలగించి దుకాణాలు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై(బందరు రోడ్డు) ట్రాఫిక్ విపరీతంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతుబజార్ వద్దకు వచ్చిన వారు వారి వాహనాలు నేరుగా జాతీయ రహదారి పైనే అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. అలాగే కూరగాయలు కొన్నవారు ఇక్కడ రహదారి దాటుతున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో తరచుగా ప్రమాదాలు జరగటం, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. జాతీయ రహదారిపై వాహనాలు పార్కింగ్ చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. వాహనదారులకు హెల్మెట్, సీ బుక్, ట్రాఫిక్ రూల్స్ పాటించటం లేదని కేసులు రాసే పోలీసులు రైతుబజార్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు పార్కు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. దీని వెనుక మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అనుమతులు ఎలా ఇచ్చారు..?

జాతీయ రహదారి పక్కనే రైతుబజార్‌కు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు చేస్తుంటే ఇక్కడ మాత్రం రోడ్డు ప్రమాదాలకు రైతుబజార్ కేంద్రంగా మారింది. ప్రజల ప్రాణాలు బలికొనకముందే పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ సమర్థంగా చేపట్టాలి



కంకిపాడు: ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థంగా చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎస్.కన్నమనాయుడు ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక రోజు అవగాహనా కార్యక్రమం కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. శిక్షణ అనంతరం పునాదిపాడు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో క్షేత్ర స్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ తీరును పరిశీలించారు. కన్నమనాయుడు మాట్లాడుతూ ఘన వ్యర్థాల సేకరణ, చెత్త సంపద కేంద్రాలకు తరలించి బాధ్యతతో నిర్వహించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంతో ప్రతి ఒక్కరూ ప్రధాన పాత్ర వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ ఎం.విజయకుమారి, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, డెప్యూటీ ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైనసైటిస్ లక్షణాలపై అవగాహన



గన్నవరంరూరల్: ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి నీరు కారటం, తలనొప్పి సైనసైటిస్ లక్షణాలని హెచ్‌వోడీ డాక్టర్ సతీష్ చంద్ర పేర్కొన్నారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మెడికల్ అండ్ హెల్త్, డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో డెంటల్ ఎగ్జిబిషన్లు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. 2 వేల మంది విద్యార్థులు ఎగ్జిబిషన్లను సందర్శించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్య అవగాహన పెంచేందుకు సిద్ధార్థ అకాడమీ యాజమాన్యం ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసిందన్నారు. డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రామోజీరావు మాట్లాడుతూ దంత సంరక్షణతోనే ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన పలు విద్యా సంస్థల విద్యార్థులు ఎగ్జిబిషన్లను సందర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు సబ్‌స్టేషన్ పరిధిలోని లంకపల్లి ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు గుడివాడ ఈఈ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పొణుకుమాడు, గారపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, లంకపల్లి, ఓద్రంపాడు, ముక్కపాడు, ఎలుకపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.